క్లుప్తంగా

భూగర్భ జలాలను కాపాడుకోవాలి



భూగర్భజలాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తనకల్లు: భూగర్భ జలాలను కాపాడుకోవాలని జనజాగృతి సంస్థ ప్రతినిధులు రైతులకు సూచించారు. గొండ్లపల్లిలో గురువారం పంట నీరు ప్రణాళికపై రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భజలాలను జాగ్రత్తగా వాడుకోవాలన్నారు. అనంతరం భూగర్భ జలాల పరిరక్షణ, నీటి వాడకం, ఖర్చు, జల నిర్వహణ తదితర అంశాలను చార్టుల రూపంలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనజాగృతి సంస్థ సిబ్బంది శ్రీనివాసులురెడ్డి, గరుడప్ప, పలువురు రైతులు పాల్గొన్నారు.

10న ఉచిత వైద్య శిబిరం



పోస్టరను విడుదల చేస్తున్న ఎంఈఓ లలితమ్మ, పూర్వ విద్యార్థులు

తనకల్లు: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఈ నెల 10న ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గురువారం పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1983 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో అనంతపురంలోని మార్క్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుల సహకారంతో గుండె వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎంఈఓ లలితమ్మ చేతుల మీదుగా ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. పూర్వ విద్యార్థులు విశ్వనాథ్‌రెడ్డి, మాధవరెడ్డి, దామోదర్‌రెడ్డి, బాబు, కేశవ్‌రెడ్డి, నరేంద్ర, ప్రసాద్, సురేష్, మల్లి, మురళీ, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు వేమయ్యయాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విజయనగరంలో జరిగే ఏఐఎస్ఎఫ్ 49వ మహాసభల పోస్టర్లను ఆయన విడుదల చేసి మాట్లాడారు. విద్యా ప్రవేటీరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించాలన్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. వైద్యవిద్యను పేదలకు దూరం చేసే జీఓ రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలన్నారు. మెస్ చార్జీలను రూ.2,500కు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహేంద్ర, ఏఐటీయూసీ నాయకులు మధునాయక్, చౌడప్పతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మృతులకు నివాళి

ధర్మవరం అర్బన్: పెనుకొండ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం పట్టణానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్, అతని కూతురు భవిత మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం వారి మృతదేహాలను పట్టణంలోని పోతుకుంట రోడ్డులోని వారి ఇంటికి బంధువులు తీసుకొచ్చారు. తండ్రీ, కూతుళ్ల మృతదేహాలకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, నాయకులు రామకృష్ణనాయక్, అంజనేయులు, హరికృష్ణ, సాయిగణేష్, రామంజనేయులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్, కూతురు భవిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని యూటీఎఫ్ నాయకులు తెలిపారు.

విధుల్లో చేర్చుకోండి



ఏపీఎం రమణప్పకు వినతిపత్రం అందిస్తున్న వీఓఏలు

నల్లచెరువు: తమను విధుల్లో చేర్చుకోవాలని వీఓఏలు అధికారులను కోరారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో పని చేస్తున్న ఏడుగురు మహిళా వీఓఏలను కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజకీయ కారణాలతో తొలగించారు. అయితే తమను అక్రమంగా తొలగించడాన్ని సవాల్ చేస్తూ మహిళా వీఓఏలు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గత నెల 19న ఏడుగురు వీఓఏలను విధుల్లో చేరాలని స్టే ఆర్డర్ ఇచ్చింది. కోర్టు ఆదేశాల మేరకు తమను వెంటనే విధుల్లో చేర్చుకోవాలని ఏపీఎం రమణప్పకు వీఓఏలు గురువారం వినతిపత్రం అందజేశారు.



బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



అలంకారప్రాయంగా ఉన్న ఆర్టీసీ బస్సులోని ఫస్ట్ ఎయిడ్ బాక్స్

ప్రథమ చికిత్సపై నిర్లక్ష్యమేల?

- ఆర్టీసీ బస్సుల్లో కనిపించని ఫస్ట్ ఎయిడ్ కిట్
- ప్రమాదం జరిగితే ఎలాగంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

ధర్మవరం అర్బన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్‌లు అలంకారప్రాయంగా మారాయి. ప్రయాణ సమయంలో ఏవైనా ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స చేసేందుకు అందుబాటులో ఉండాల్సిన కిట్లు ఆర్టీసీ బస్సుల్లో లేవు. డ్రైవర్ సీటు వెనకాల ఫస్ట్ ఎయిడ్ కిట్ బాక్స్ అని అక్షరాలు మాత్రమే కనిపిస్తున్నాయి. రవాణా శాఖ నిబంధనల ప్రకారం బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సు తప్పనిసరిగా ఉండాలి. కానీ ఏ బస్సుల్లోనూ మచ్చుకు కూడా కనిపించడంలేదు. కొన్ని బస్సుల్లో ఉన్నప్పటికీ వాటిలో ప్రథమ చికిత్స చేసేందుకు మందులు ఉండటంలేదు.

రోజూ 25వేల కి.మీ ప్రయాణం

ధర్మవరం ఆర్టీసీ డిపో పరిధిలో 69 బస్ సర్వీసులు ఉన్నాయి. ఇందులో అద్దె ప్రాతిపదికన తిరుగుతున్నవి 26 బస్సులు. రోజూ దాదాపు 25వేల కిలోమీటర్ల బస్సులు తిరుగుతూ ప్రయాణికులను గమ్యస్థానాలకు తీసుకెళ్తున్నాయి. అయితే ఏ బస్సులోనూ ఫస్ట్ ఎయిడ్ కిట్లు లేకపోవడం గమనార్హం.

కిట్‌లో ఏముంటాయంటే..

బస్సు ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసేందుకు వీలుగా ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో కాటన్, కత్తెర, అయోడిన్, ప్లాస్టర్లు, ఆయింట్‌మెంట్ తప్పనిసరిగా ఉండాలి. బస్సుల్లోని ఫస్ట్ ఎయిడ్ బాక్సుల్లో అన్ని వైద్య పరికరాలు ఉన్నాయో లేవో సరిచూసుకోకపోతే సంబంధిత బస్ కండక్టర్, డ్రైవర్ల నుంచి అపరాధ రుసుం వసూలు చేసేవారు. కాని ఆర్టీసీ అధికారులే పట్టించుకోకపోవడంతో ఇక కార్మికులు ఏమిచేస్తారు?



ఎక్స్‌ప్రెస్ బస్సు ఫస్ట్ ఎయిడ్ బాక్సులో మందులు లేని దృశ్యం



మందులు లేక ఖాళీగా ఉన్న ఫస్ట్ ఎయిడ్ బాక్సు

కిట్లు ఏర్పాటు చేయిస్తాం



ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయిస్తాం. బాక్సులు సరిగా లేనందున కిట్లను కండక్టర్ల వద్ద ఉంచాం. ఫస్ట్ ఎయిడ్ కిట్లు లేని బస్సుల్లో తెప్పించి వాటిలో కూడా ఏర్పాటు చేయిస్తాం.

– సత్యనారాయణ, ఆర్టీసీ డిపో మేనేజర్, ధర్మవరం

ప్రమాదం జరిగితే ఎలా..?

ఆర్టీసీ బస్సుల్లో నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో లేకపోతే ఎలా? ప్రథమ చికిత్స అందిస్తే రక్తస్రావం నుంచి క్షతగాత్రులను కాపాడవచ్చు. చిన్నపాటి చికిత్స ప్రాణాలను నిలుపుతుంది. బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– రామకృష్ణ, బడన్నపల్లి, ధర్మవరం మండలం

అందుబాటులో ఉంచాలి

ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు అందుబాటులో లేవు. ఎప్పుడైనా ప్రమాదం జరిగితే ఏమి చేయాలి? ప్రతి బస్సులోనూ ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు ఏర్పాటు చేసి ప్రమాదాల సమయంలో ఉపయోగపడేలా చూడాలి.

– విశ్వనాథ్, ధర్మవరం

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

కదిరి: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, కమిషనర్ కె.కిరణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు 15వ ఆర్థిక ప్రణాళిక సంఘం నిధుల వినియోగంపై సమావేశం నిర్వహిస్తామన్నారు. కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించండి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం అర్బన్: పన్ను బకాయి వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం వార్డు పరిపాలనా కార్యదర్శులు, వార్డు అమెనిటీ కార్యదర్శులతో మున్సిపల్ ఆర్థిక వృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి పన్ను రూ.13.77 కోట్లు, నీటి చార్జీలు రూ.8.88 కోట్లు, ఖాళీ భూమి పన్ను రూ.90 లక్షలు బకాయిలు ఉన్నాయన్నారు. వార్డు కార్యదర్శులు బకాయి పన్నులను త్వరితగతిన వసూలు చేసి మున్సిపల్ ఆదాయాన్ని మెరుగుపరచాలన్నారు. అనంతరం ఆయా వార్డుల వారీగా బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అక్రమ అరెస్టులు వెంటనే ఆపాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తల అక్రమ అరెస్టులను అపాలని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇంచార్జ్ లింగాల లోకేశ్వరరెడ్డి, నాయకుడు దశరథనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు గురువారం డీఎస్పీ శివనారాయణస్వామిని కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎలాంటి తప్పు చేయకుండానే వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లను అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఎన్నికల్లో ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చిన సీఎం చంద్రబాబు వాటి అమలుపై శ్రద్ధ చూపడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. సోషల్ మీడియా కన్వీనర్లు అమర్‌నాథ్‌రెడ్డి, వాల్మీకి అంజిని వెంటనే విడుదల చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం క్రీడాకారుడు



క్రీడాకారుడిని అభినందిస్తున్న బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ధర్మవరం క్రీడాకారుడు ఎంపికైనట్లు ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో గురువారం రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారుడిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల అనంతపురం ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పట్టణానికి చెందిన విజయ్ తరుణ్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడన్నారు. అండర్–19 విభాగంలో ఉమ్మడి అనంతపురం బాస్కెట్‌బాల్ బాలుర జట్టు తరపున ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వాయల్పాడు హిదయ్‌తుల్లా, కోచ్ సంజయ్ పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం

తలుపుల : నూతనకాల్వ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి గురువారం మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి రూ.20 వేలు విరాళం అందించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, సురేష్‌రెడ్డి సర్పంచుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నల్లచెరువు: కె పూలకుంట సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.20,750 రెండు బైక్‌లు, ఏడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మక్బూల్ బాషా తెలిపారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజశేఖర్

ముదిగుబ్బ: ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నట్లు పట్నం ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. గురువారం నాగారెడ్డిపల్లి గ్రామాన్ని ఆయన సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ఫ్యాక్షన్ గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్‌ఐ వారికి సూచించారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి

ధర్మవరం అర్బన్: యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ రామకృష్ణనాయక్ కోరారు. పట్టణంలోని బీఎస్‌ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం యూటీఎఫ్ జిల్లా మున్సిపల్ కన్వీనర్ బిల్లే రామాంజినేయులు, నాయకులు రాంప్రసాద్, హరిశంకర్, ప్రదీప్‌కుమార్ తదితరులు యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగుల కోర్కెలను మన్నించి పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలన్నారు. బకాయి ఉన్న డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ఐసీ మొత్తాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల అపార్ నంబర్ జెనరేట్‌లో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలన్నారు. ఈనెల 10న కదిరిలో జరిగేజిల్లా స్వర్ణోత్సవ మహాసభలకు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

రామగిరి: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 10వ తేదీన కదిరిలో జరిగే మహాసభను విజయవంతం చేయాలని ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కుంటిమద్దిలో ఉన్న సదానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలన్నారు. బకాయిపడిన డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ఐసీ విడుదల చేయాలని కోరారు. అనంతరం యూటీఎఫ్ రామగిరి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాకొండ శివయ్య, ప్రధాన కార్యదర్శిగా వినయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా గోపాలరెడ్డి, ఉపాధ్యక్షులుగా శివారెడ్డి, పద్మజ, కోశాధికారిగా సురేష్, జిల్లా కౌన్సిలర్లుగా సకల చంద్రశేఖర్, మల్లేష్, ఆదినారాయణ, రామకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులుగా తులశమ్మ, ప్రసాద్, మల్లికార్జునను ఎన్నుకున్నారు.

అర్హులకు న్యాయం చేయండి



ఆర్డీఓతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి అర్బన్: గత ప్రభుత్వంలో ఇంటి పట్టాలు పొందిన వారికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్డీఓ సువర్ణను కోరారు. గురువారం మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, రాష్ట్ర కార్యదర్శి సాయిలీల, మాజీ కౌన్సిలర్లు నారాయణరెడ్డి, ఫొటో సాయి, ఆవుల రామచంద్ర, నారపరెడ్డి, రామయ్య, హరినాథరెడ్డి, శ్రీనివాసులు, ఓబుళరెడ్డి, సందీప్ ఆర్డీఓను కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతిగ్రామంలోని జానకిరామ్ కాలనీలో ఇచ్చిన ప్లాట్లలో నిర్మాణాలు చేపట్టకుండా అడ్డుకుంటున్నారన్నారు. కొత్తచెరువులో ప్లాట్లకు కోర్టు స్టేటస్‌కో ఇచ్చినా లబ్ధిదారులను అడ్డుకుంటున్నారని, పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులకు న్యాయం చేస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు.

ఆరవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాఘవేంద్ర



కదిరి అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఆరవైశ్య యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కదిరికి చెందిన వంకధార రాఘవేంద్ర ఎన్నికయ్యారు. బుధవారం కర్నూలులో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ నెల 24న అనంతపురంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు రాఘవేంద్ర తెలిపారు. సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

కదిరి అర్బన్: మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ ఈశ్వర్ గురువారం తెలిపారు. డిసెంబర్ 10 వరకు గ్రామసభలు నిర్వహిస్తామని, ప్రజలు తమ సమస్యలపై ఆధార్‌కార్డు, సెల్ నంబర్‌తో అర్జీలు ఇవ్వాలని సూచించారు.

తలుపుల : మండలంలో శుక్రవారం నుంచి ఈనెల 27 వరకూ రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రెడ్డి శేఖర్ గురువారం తెలిపారు. తొలిరోజు నూనతకాల్వ గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి మండలంలో శుక్రవారం నుంచి ఈనెల 27 వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ బీవీ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. తొలిరోజు కొట్లపల్లి, 12న దిగువచెర్లోపల్లి, 14న నిడిమామిడి, 15న జగరాజుపల్లి, 19న కప్పలబండ, 21న వెంగళమ్మ చెరువు, 22న ఎనుములపల్లి, 26న బ్రాహ్మణపల్లి, 27న పుట్టపర్తిలోని హనుమాన్ ఆలయంలో గ్రామసభలు జరుగుతాయన్నారు.

శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను శిక్షించొద్దు



ఐక్యత చాటుతున్న ఉపాధ్యాయులు

ఎన్పీకుంట: వివిధ రకాల శిక్షణల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ శిక్షించడం తగదని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫౌండేషన్ లిట్రసీ అండ్ న్యూమరసీ పేరుతో ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులను, లీడర్‌షిప్ ట్రైనింగ్ పేరుతో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలను పాఠశాలల్లో విద్యాబోధనకు దూరం చేయడం తగదన్నారు. ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ ఐడీలు సృష్టించమని ఒక వైపు ఒత్తిడి తీసుకొస్తూనే ఆధార్ అప్డేషన్ చేయించమని, టెన్త్ విద్యార్థులకు నామినల్‌రోల్స్ తయారు చేయమని, ఎఫ్ఏ 2 పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించమని చెబుతున్నారన్నారు. దీంతోపాటు నవంబర్ 14న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ జరపాలని ఉపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడం అన్యాయమన్నారు. మరోవైపు రెసిడెన్షియల్ శిక్షణ తరగతుల పేరుతో అరకొర వసతులు కలిగిన శిక్షణా కేంద్రాల్లో ఉపాధ్యాయులను నిర్బంధించి తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఈక్రమంలో పశ్చిమగోదావరి జిల్లాలో ఒక ఉపాధ్యాయుడు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను తక్షణం రద్దు చేసి వేసవి సెలవుల్లో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణా తరగతులను నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాయకులు రామాంజులుయాదవ్, రమణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



జగరాజుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్యాధికారులు

పుట్టపర్తి అర్బన్: క్యాన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. గురువారం ఆమె వైద్యాధికారులతో కలిసి జగరాజుపల్లి ఉన్నత పాఠశాల, ఎనుములపల్లి వాసవీ పాఠశాలల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమన్నారు. క్రమం తప్పని వైద్య పరీక్షలు, ధూమపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండడం, మంచి ఆహారపు అలవాట్లతో వ్యాధిని దూరం చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ ఇంటి వద్దనే పరీక్షిస్తారని, అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎపిడేమియోలజిస్ట్ బాలాజీ నాయక్, డాక్టర్ మునిచంద్రిక, డాక్టర్ జ్యోత్స్న, సీహెచ్‌ఓ నగేష్, పీహెచ్‌ఎన్ లలితకుమారి, హైస్కూల్ హెచ్‌ఎం ఈశ్వరనారాయణరెడ్డి, సునందాదేవి, సూపర్‌వైజర్ చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్స్‌కు ఆర్థికసాయం

ధర్మవరం అర్బన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ల్యాబ్ టెక్నీషియన్స్ ప్రదీప్, ఐతీష్‌కు ధర్మవరం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సభ్యులు ఆర్థికసాయం అందించారు. ఈమేరకు వారు గురువారం రూ.22 వేలను బాధితుల కుటుంబాలకు అందజేశారు.

కరెంటు బిల్లులు తగ్గించాలని నిరసన

రామగిరి: కరెంటు బిల్లులు తగ్గించాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పేరూరు డ్యాంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేశారు. సామాన్యులపై విద్యుత్ భారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో రాప్తాడు నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు బిల్లే ముత్యాలు, నాయకులు ఆకులేటి నాగేష్, అంజనే యులు, మంజు తదితరులు పాల్గొన్నారు.

లే అవుట్ పరిశీలన



హరియన్‌చెరువులో లే అవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

చెన్నేకొత్తపల్లి: న్యామద్దెల గ్రామ పంచాయతీ పరిధిలోని హరియాన్ చెరువు గ్రామంలో వేసిన లే అవుట్‌ను గురువారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు పరిశీలించారు. గ్రామంలో లే అవుట్ వేసిన విషయాన్ని తెలుసుకున్న తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీఓ శివశంకర్ గ్రామస్థాయి అధికారులు విచారించారు. లే అవుట్ వేసేందుకు ఎలాంటి అనుమతి తీసుకోక పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. లే అవుట్ ఏర్పాటుకు పంచాయతీ అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ నరసింహమూర్తి, వీఆర్ఓ విశ్వనాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, రమణ వీఆర్‌ఏ పెద్దన్న పాల్గొన్నారు.

మరమ్మతు పేరుతో ఎడాపెడా విద్యుత్ కోతలు

పుట్టపర్తి టౌన్: పట్టణంలో విద్యుత్ అధికారులు మరమ్మతుల పేరుతో ఎడాపెడా విద్యుత్‌కోతలు విధిస్తుండంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా పట్టణంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పూర్తిగా విద్యుత్ సరఫరా ఆపేశారు. దీంతో వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మీసేవా కేంద్రాలు, ఆధార్ కేంద్రాలు, మున్సిపల్ కేంద్రాల వద్ద గంటల తరబడి పడిగాపులు కాశారు. ప్రధానంగా విద్యార్థులు అపార్ కార్డులకు సంబంధించి ఆధార్ అప్‌డేట్, చేర్పులు మార్పులు చేసుకునేందుకు అవస్థలకు గురయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయ పనివేళల్లో కోతలు విధించకుండా చూడాలని కోరుతున్నారు.

నిందితుడికి రిమాండ్

పరిగి: హత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. 2021లో గొరవనహళ్లి బస్టాండ్‌సమీపంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో అనిల్‌కుమార్ నిందితుడు. బెయిల్‌పై బయటికొచ్చిన అనిల్‌కుమార్ తదనంతరం కోర్టు వాయిదాలకు వెళ్లలేదు. ఈక్రమంలో కోర్టు ఆదేశాల మేరకు గురువారం పోలీసులు గొరవనహళ్లికి వెళ్లి నిందితుడిని పట్టుకుని కోర్టులో హాజరుపర్చారు. జడ్జి ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.